


TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్



WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354



హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-231 | పేజీలు:-4 | మంగళవారం 04-08-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM


## ఒప్పందానికి అమెరికా కట్టుబడాలి ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్

- అమెరికాపై ఒత్తిడి తీసుకురావాలన్న ఇరాన్ అధ్యక్షుడు
- శాంతి ఒప్పందానికి కట్టుబడేలా చేయాలని సూచన
- ఇదే తమ విదేశాంగ విధానంలో కీలకం అంటున్న ఇరాన్
- శత్రువుల ముప్పును తీవ్రంగానే పరిగణిస్తామన్న రక్షణ మంత్రి



ఇరాన్‌తో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందానికి అమెరికా కట్టుబడేలా ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ స్పష్టం చేశారు. ఈ ఒప్పందం విషయంలో తమ దేశ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ - మిగతా 2 లో

## నాడు టైటానిక్ లో ప్రయాణికులు ఏం తిన్నారు? మెనూ ఇదే!

- ★టైటానిక్ షిప్‌లో ప్రయాణికుల తరగతిని బట్టి భోజన సదుపాయాలు
- ★ఫస్ట్ క్లాస్ ప్రయాణికులకు విలాసవంతమైన బహుళ రకాల వంటకాలు
- ★సెకండ్ క్లాస్‌లో కూడా నాటి కాలానికి నాణ్యమైన ఆహారం
- ★థర్డ్ క్లాస్ టికెట్‌లోనే భోజనం కలిపి ఉండటం నాటి ప్రత్యేకత
- ★మునిగిపోయే ముందు రోజు రాత్రి ఫస్ట్ క్లాస్‌లో భారీ విందు



టైటానిక్ నౌక అనగానే అందరికీ దాని విషాదాంతమే గుర్తుకు వస్తుంది. అయితే, 1912 ఏప్రిల్ 15న సముద్రగర్భంలో కలిసిపోవడానికి ముందు ఆ నౌక ఒక తేలియాడే విలాసవంతమైన భవంతి. ముఖ్యంగా అందులో కల్పించిన - మిగతా 2 లో

## "మిస్టర్ డ్రామారావు" అంటూ కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్



- పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని ఆరోపణ
- పదేళ్లలో మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించారని విమర్శ
- అధికార లాంఛనాలతో గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వెల్లడి
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్య

తెలంగాణ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ - మిగతా 2 లో

## పెద్ది సుదర్శన్ రెడ్డి విషయంలో అది అత్యంత బాధాకరం



- సుదర్శన్ రెడ్డి ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడేవారన్న కేటీఆర్
- విద్యాశాఖలోని బెడ్స్ కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెట్టారని వెల్లడి
- అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని మండిపాటు

దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డిపై తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చిందన్న - మిగతా 2 లో

# నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తి

- నిమ్స్‌లో రెండున్నరేళ్లలో 1,000 రొబోటిక్ సర్జరీలు పూర్తి అయ్యాయని తెలంగాణ మంత్రి
- దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు
- రాష్ట్ర సచివాలయంలో నిమ్స్ వైద్య బృందం మంత్రిని కలిశారు.




నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి అయ్యాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్ తో పాటు వైద్య బృందం,

## కర్ణాటకలో కాంగ్రెస్‌లో కలకలం




- ఇద్దరు ఎమ్మెల్యేలు, మరో 10 మంది ఎమ్మెల్యేల రాజీనామా?
- మంత్రివర్గ విస్తరణతో కర్ణాటక రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి
- మంత్రి పదవిపై ఆశ పెట్టుకున్న వారు తమకు అవకాశం లభించకపోవడంతో తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు
- దీంతో వెంటనే తమ ఎమ్మెల్యేల పదవులకు రాజీనామా చేశారు
- ఈ వ్యవహారం కర్ణాటక రాజకీయాలను ఒక్కసారిగా వేడెక్కించాయి.

అధికార కాంగ్రెస్ పార్టీలో ముసలం ఏర్పడింది. ముఖ్యమంత్రిని మార్చిన కొన్ని నెలల - మిగతా 2 లో

# 'ప్రధాని వీడియో తొలగింపునకు జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పాలి

- మెటాతో పార్లమెంటరీ ప్యానెల్ చీఫ్
- అభ్యంతరకరమైన ఇతర కంటెంట్‌ను ఆన్‌లైన్‌లో అలాగే ఉంచి
- ఈ వీడియోపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకున్నారు?
- అని మెటా అధికారులను ప్రశ్న




ప్రధాని నరేంద్ర మోదీ అధికారిక ఫేస్ బుక్ పోస్టు తొలగింపు వ్యవహారంపై కమ్యూనికేషన్స్, ఐటీ పార్లమెంటరీ స్థాయీ కమిటీ తీవ్రంగా స్పందించింది. పది రోజుల్లోగా తమ వైఖరిని లిఖితపూర్వకంగా స్పష్టం చేయాలని

## సీఎం విజయ్‌కు తొలి అగ్నిపరీక్ష కావేరి జలాలపై రాజకీయ రగడ!



- కావేరి రూపంలో విజయ్‌కు తొలి రాజకీయ సవాల్
- కావేరి జలాలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటుకు డీఎంకే డిమాండ్
- ప్రతిపక్షాల డిమాండ్‌ను తిరస్కరించిన విజయ్ ప్రభుత్వం
- ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేశామంటున్న అధికార పార్టీ
- ప్రభుత్వ వైఖరికి నిరసనగా తంజావూరులో భారీ ఆందోళనకు డీఎంకే పిలుపు

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌కు తొలి రాజకీయ అగ్నిపరీక్ష ఎదురైంది. - మిగతా 2 లో

## జగన్ డైరెక్షన్ లోనే అటవిక చర్యలు



- రాష్ట్రం నుంచి తరిమికొట్టే రోజు దగ్గరపడింది: మంత్రి పార్థసారథి
- జగన్ అండతో వైసీపీ నేతలు దాడులకు పాల్పడుతున్నారన్న మంత్రి
- కర్నూలులో దళిత కుటుంబంపై వైసీపీ ఎమ్మెల్యే దాడి అమానుషం అని వ్యాఖ్యలు
- దళితులు, మహిళలపై దాడులు జరుగుతున్నా జగన్ మౌనం దారుణమంటూ విమర్శలు
- తప్పు చేస్తే సొంత నేతలనూ చంద్రబాబు మందలిస్తారని వెల్లడి
- అరాచక శక్తులను ఉపేక్షించం, చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

రాష్ట్రంలో వైసీపీ నేతలు సాగిస్తున్న అరాచకాలు, దౌర్జన్యాల వెనుక ఆ పార్టీ అధినేత - మిగతా 2 లో

## అమరావతి ఐకానిక్ భవనాల నిర్మాణాలు గడువు ప్రకారం పూర్తి కావాలి



- ఐకానిక్ భవనాల నిర్మాణ పనులు పురోగతిపై నారాయణ సమీక్షా సమావేశం
- నిర్మాణాలు ఏయే దశల్లో ఉన్నాయో అధికారుల నుంచి తెలుసుకున్న నారాయణ
- వర్షాల కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్న మంత్రి

రాజధాని అమరావతి పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల నిర్మాణ - మిగతా 2 లో

# రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించండి

- తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు
- ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై సమీక్ష
- రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించి, సేవలు సులభతరం చేయాలని సూచన
- పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశం
- వివిధ శాఖల పనితీరుపై ఆర్టీజీఎస్‌లో ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ




రవాణా శాఖలో అనవసర నిబంధనలను తక్షణమే తొలగించాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో ఉపయోగించి ప్రజలకు సులభతరమైన, అవినీతి రహిత సేవలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
మంగళవారం 04-08-2026

# "మిస్టర్ డ్రామారావు" అంటూ కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్

మొదటిపేజీ తరువాయి – వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దివంగత ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం 'ఎక్స్' వేదికగా ఘాటు విమర్శలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆయన్ని విస్మరించి, ఇప్పుడు ఆయన మరణంపై రాజకీయం చేస్తున్న 'మిస్టర్ డ్రామారావు' కేటీఆర్ అంటూ పొంగులేటి మండిపడ్డారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఉద్యమకారుడైన పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించిందని పొంగులేటి ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఓటమి పాలైన తర్వాత ఆయనకు కనీసం రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ పదవి అయినా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. సంతోష్ రావు, దామోదర్ రావు వంటి వారికి పదవులు కట్టబెట్టిన బీఆర్ఎస్ నాయకత్వం, పెద్ది సుదర్శన్ రెడ్డిని ఎందుకు విస్మరించిందని ఆయన ప్రశ్నించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ది సుదర్శన్ రెడ్డిని వైద్య చికిత్స కోసం వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిందని, ఆయన అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేశారు. ఉద్యమకారులను కేవలం ఓట్ల కోసం వాడుకుని, అధికారం, కీలక పదవులన్నీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయమని పొంగులేటి ధ్వజమెత్తారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి విషయంలో అది అత్యంత బాధాకరం

మొదటిపేజీ తరువాయి – ఆరోపణలు నిజమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సుదర్శన్ రెడ్డి విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలను ఏ ఒక్కరినీ వదలకుండా వేధింపులకు, టార్చర్‌కు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి నిత్యం ప్రజా సమస్యలపై పోరాడేవారని, ప్రభుత్వంలోని అక్రమాలను నిరంతరం బయటపెట్టేవారని కేటీఆర్ గుర్తుచేశారు. సివిల్ సప్లైస్ స్కామ్‌తో పాటు విద్యాశాఖలోని బంకర్ బెడ్స్ కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెట్టారని చెప్పారు. ఆ ఆధారాలను ఈడీ కార్యాలయానికి అందజేయడమే కాకుండా సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారని తెలిపారు. అయితే, సుదర్శన్ రెడ్డి మరణించిన మరునాడే సుప్రీంకోర్టు నుంచి నోటీసులు జారీ అవుతూ గైడెన్స్ రావడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని వ్యక్తులు ఆయన విమర్శలను తట్టుకోలేక, అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను ప్రధాని మోదీ నిలిపివేసారని సీఎం రేవంత్ రెడ్డి బుకాయిస్తున్నారని, ఆయన చేసిన తీర్మానం కేవలం ఒక చిత్తు కాగితమని కొట్టిపారేశారు. సోనియా గాంధీ తెచ్చిన విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారా అని ప్రశ్నించారు. గురుకులాల్లో 150 మంది విద్యార్థులు చనిపోవడం, 7 వేల ఐటీ ఉద్యోగాలు పోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. గోదావరిలో నీళ్లు సముద్రం పాలు అవుతున్నా రైతాంగానికి నీళ్లందించకుండా ఎండబెడుతున్నారని మండిపడ్డారు. పంపింగ్ ద్వారా నీళ్లు మిడ్ మానేరుకు ఎలా వస్తున్నాయో తెలియని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, హెలికాప్టర్లలో వెళ్లి పోజులు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. మెట్రో ప్రాజెక్టును ప్రభుత్వం టేకోవర్ చేయడం వెనుక రూ.200 కోట్లు కొల్లగొట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు వేసిన స్కెచ్ ఉందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసే కుట్రలు సాగుతున్నాయని అన్నారు.


## నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తి

మొదటిపేజీ తరువాయి – నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందని వ్యాఖ్యానించారు. నిమ్స్ లో ఇప్పటివరకు నిర్వహించిన రొబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని సీఎం పేర్కొన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందని చెప్పుకొచ్చారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. నిమ్స్‌లో రెండున్నరేళ్లలో 1,000 రొబోటిక్ సర్జరీలు పూర్తి అయ్యాయని తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. ఈరోజు రాష్ట్ర సచివాలయంలో నిమ్స్ వైద్య బృందం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారిని మంత్రి దామోదర అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికే 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను నిమ్స్ పూర్తి చేసిందని వెల్లడించారు. దక్షిణ భారత ప్రభుత్వ రంగంలో తొలి రొబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌ను నిమ్స్ చేసిందని మంత్రి దామోదర చెప్పుకొచ్చారు. 90 శాతానికి పైగా రొబోటిక్ సర్జరీలు ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఉచితమని తెలిపారు. యూరాలజీలో 590, గ్యాస్ట్రోలో 248, ఆంకాలజీలో 162 రొబోటిక్ సర్జరీలు జరుగుతాయని వివరించారు. ఎంఎన్‌జేలోనూ విజయవంతంగా రొబోటిక్ సర్జరీలు నిర్వహిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. కొత్త టిమ్స్, గాంధీ, ఉస్మానియాలో రొబోటిక్ ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తెస్తున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

## ఒప్పందానికి అమెరికా కట్టుబడాలి ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్

సభ్యుల మధ్య పూర్తి ఏకాభిప్రాయం ఉందని ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. భవిష్యత్తులో ఇరాన్ విదేశీ సంబంధాలకు ఈ ఒప్పందమే కేంద్ర బిందువుగా ఉంటుందని పెజెష్కియాన్ అభిప్రాయపడ్డారు. "శత్రువులు తాము సంతకం చేసిన ఒప్పందాలకు కట్టుబడి ఉండేలా మనం ఒత్తిడి చేయాలి. ఈ ఒప్పందం వల్ల మన దేశంతో పాటు ఈ ప్రాంతంలోని మిత్రదేశాల భద్రత మరింత మెరుగుపడుతుంది" అని ఆయన పేర్కొన్నారు. ఇదే సమయంలో, శత్రువుల నుంచి ఎదురయ్యే ప్రతి ముప్పును తాము తీవ్రంగా పరిగణిస్తామని, వాటిని కేవలం మానసిక యుద్ధంగా భావించి కొట్టిపారేయబోమని ఇరాన్ తాత్కాలిక రక్షణ మంత్రి సయ్యద్ మజీద్ ఎబ్న్ అల్-రజా అన్నారు. ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడానికి, నిరోధక శక్తిని బలోపేతం చేసుకోవడానికి ఈ సన్నద్ధత దోహదపడుతుందని ఆయన వివరించారు. జూన్ 18న ఇరాన్, అమెరికా మధ్య ఈ అవగాహన ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం 60 రోజుల్లోగా తుది ఒప్పందంపై చర్చలు జరగాల్సి ఉంది. అయితే, ఇటీవల ఇరు దేశాల మధ్య పెరిగిన ఉద్రిక్తతల కారణంగా ఈ చర్చల ప్రక్రియ ప్రభావితమైంది. గతంలో హర్మూజ్ జలసంధిలో నౌకలపై దాడులు జరిగిన నేపథ్యంలో, అమెరికా ఇరాన్ లక్ష్యాలపై దాడులు చేయగా, ఇరాన్ సైతం ప్రతిగా ఆ ప్రాంతంలోని అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది.

## నాడు టైటానిక్ లో ప్రయాణికులు ఏం తిన్నారు? మెనూ ఇదే!



మొదటిపేజీ తరువాయి – భోజన సదుపాయాలు ప్రయాణికుల తరగతిని బట్టి ఎంతో వైవిధ్యంగా ఉండేవి. వందేళ్ల తర్వాత లభించిన ఆనాటి మెనూ కార్డుల ద్వారా పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఫస్ట్ క్లాస్ ప్రయాణికులకు అందించిన భోజనం యూరప్‌లోని అత్యుత్తమ లగ్జరీ హోటళ్లతో సమానంగా ఉండేది. ఇందులో ఫ్రెంచ్ వంటకాలకు అధిక ప్రాధాన్యతనిచ్చేవారు. ఓడ మునిగిపోవడానికి కొన్ని గంటల ముందు, అంటే ఏప్రిల్ 14 రాత్రి జరిగిన విందులో ఆయిస్టర్స్, పాచ్డ్ సాల్మన్, ఫిలె మిన్యాన్, రోస్ట్ డక్లింగ్ వంటి అనేక రకాల వంటకాలను వడ్డించారు. డెజర్ట్‌లలో ఫ్రెంచ్ ఐస్‌క్రీమ్, ఎక్లెయిర్స్ వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సెకండ్ క్లాస్ ప్రయాణికులకు కూడా నాటి ప్రమాణాలకు అనుగుణంగా అత్యంత నాణ్యమైన ఆహారాన్ని అందించేవారు. రోస్ట్ బీఫ్, చికెన్, బేక్డ్ ఫిష్ వంటివి వీరి మెనూలో ఉండేవి. ఇక అత్యంత ఆశ్చర్యకరమైన విషయం థర్డ్ క్లాస్ భోజన సదుపాయం. ఆ రోజుల్లో చాలా నౌకల్లో థర్డ్ క్లాస్ ప్రయాణికులు తమ ఆహారాన్ని తామే సమకూర్చుకోవాల్సి వచ్చేది. కానీ టైటానిక్‌లో టికెట్ ధరలోనే భోజన వసతిని కల్పించారు. వారికి ఓట్‌మీల్, గుడ్లు, రోస్ట్ బీఫ్ వంటి పోషకాహారాన్ని వడ్డించేవారు. దాదాపు 2,200 మంది ప్రయాణికులు, సిబ్బందికి ఆహారం సిద్ధం చేసేందుకు నౌకలో భారీ వంటశాల ఉండేది. ఇందులో 19 ఓవెన్లతో కూడిన రెండు అతిపెద్ద వంటగదులు ఉండటం విశేషం. ప్రమాదం నుంచి లభించిన ఆనాటి మెనూ కార్డులు ప్రస్తుతం అమూల్యమైన చారిత్రక సంపదగా మిగిలాయి.

# జగన్ డైరెక్షన్ లోనే అటవిక చర్యలు

మొదటిపేజీ తరువాయి – జగన్ డైరెక్షన్ ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ పెంచి పోషిస్తున్న రౌడీ మూకల ఆటవిక చర్యలతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని, ఆ పార్టీని రాష్ట్రం నుంచి తరిమికొట్టే రోజు దగ్గరపడిందని ఆయన హెచ్చరించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నేతల దిగజారుడు రాజకీయాలపై విరుచుకుపడ్డారు. "ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తుకు బాటలు వేస్తుంటే, మరోవైపు ఐదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేని వైసీపీ.. యువతను గంజాయి, రౌడీయిజం వైపు మళ్లించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోంది. కులాల మధ్య చిచ్చుపెట్టడం, విధ్వంసం సృష్టించడమే వైసీపీలో కొనసాగడానికి అర్హతగా మారింది. తప్పు చేసి దొరికిపోయాక, 'రాజకీయ కక్ష సాధింపు' అంటూ సోషల్ మీడియాలో ఏడవడం ఆ పార్టీకి అలవాటైంది" అని పార్థసారధి ఎద్దేవా చేశారు. కర్నూలు జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఒక దళిత కుటుంబంపై బరిసెలు, మారణాయుధాలతో దాడికి పాల్పడడం హేయమైన చర్య అని మంత్రి తీవ్రంగా ఖండించారు. "ఒక దళిత సోదరి ఇంట్లోకి చొరబడి, ఆమె బట్టలు చించి అవమానించి, పైగా బాధితులే బట్టలు చించుకున్నారని సిగ్గులేకుండా ప్రచారం చేయడం వైసీపీ నీచ రాజకీయాలకు పరాకాష్ఠ. శ్రీకాకుళంలో మహిళా సీఐని అవమానించిన ఘటన నుంచి నేటి వరకు దళితులు, మహిళలపై వైసీపీ నేతల దాడులు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 45 ఏళ్లు దాటిన గొర్రెల కాపరి మరణంపై జగన్ చేసిన వ్యాఖ్యలు, పేదల ప్రాణాలంటే ఆయనకున్న చులకన భావాన్ని, విపరీత మనస్తత్వాన్ని బయటపెట్టాయని అన్నారు. తమ పార్టీ నేతలు తప్పు చేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు మందలించి సరైన మార్గంలో పెడతారని, కానీ జగన్ మాత్రం తన పార్టీ నేతల అరాచకాలకు అండగా నిలుస్తూ వారిని మరింత ప్రోత్సహిస్తున్నారని పార్థసారథి విమర్శించారు. "నా ఎస్సీ, నా బీసీ, నా మైనారిటీ అని ఎన్నికల ముందు నాటకాలు ఆడిన జగన్, ఇప్పుడు అదే దళితులు, బలహీన వర్గాలపై దాడులు జరుగుతుంటే ఎందుకు నోరు మెదపడం లేదు?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రాజ్యాంగ వ్యతిరేక శక్తులు ఎంతటివారైనా కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, చట్టం తనపని తాను చేసుకుపోతుందని, దోషులకు కఠిన శిక్షలు తప్పవని మంత్రి పార్థసారధి స్పష్టం చేశారు. ఇటువంటి అరాచక శక్తులను కూకటివేళ్లతో పెకిలించి వేస్తామని ఆయన గట్టిగా హెచ్చరించారు.

## అమరావతి ఐకానిక్ భవనాల నిర్మాణాలు గడువు ప్రకారం పూర్తి కావాలి

మొదటిపేజీ తరువాయి – పనుల పురోగతిపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు, నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో కలిసి పనుల తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సమావేశంలో ఏజీఐసీఎల్ ఎండీ అభిషేక్ కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ గోపాల్‌రెడ్డితో పాటు పలువురు చీఫ్ ఇంజినీర్లు పాల్గొన్నారు. అమరావతి ల్యాండ్‌మార్క్‌లుగా నిలవనున్న అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల నిర్మాణ పనులు ఏయే దశల్లో ఉన్నాయనే వివరాలను నారాయణ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం దృష్ట్యా నిర్మాణాలు నిలిచిపోకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటూ పనులను నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు (టార్గెట్స్) ప్రకారమే రాజధాని ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలని, ఎక్కడా నాణ్యత లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కాంట్రాక్ట్ సంస్థలకు, అధికారులకు మంత్రి నారాయణ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించండి

మొదటిపేజీ తరువాయి – ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖలో చేపట్టాల్సిన సంస్కరణలపై సీఎం కీలక సూచనలు చేశారు. రవాణా శాఖలో సంస్కరణలకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ఏర్పాటు, ఫారం-5బీ వంటి పరీక్షల తొలగింపు ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా చూడవచ్చని తెలిపారు. ఈ చర్యలతో ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. దశలవారీగా ఈ సంస్కరణలను అమలు చేసేందుకు తాము ప్రణాళిక సిద్ధం చేశామని అధికారులు చెప్పగా, వీలైనంత త్వరగా అనవసర నిబంధనలను తొలగించి, ప్రజలకు ఇబ్బందులు లేని వ్యవస్థను రూపొందించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై కూడా సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఎల్ నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని, ఈ సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు గమనిస్తూ, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నందున కృష్ణా బేసిన్‌లోకి నీటి లభ్యత పెరిగే అవకాశం ఉందని, కృష్ణా, గోదావరి నదుల నుంచి వచ్చే వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా సమర్థవంతమైన నీటి నిర్వహణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. వర్షాభావం కారణంగా భవిష్యత్తులో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉందని, దీనికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించాలని, ల్యాబ్ నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'ప్రధాని వీడియో తొలగింపునకు జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పాలి'

మొదటిపేజీ తరువాయి – పార్లమెంటరీ ప్యానెల్ సోమవారం మెటాను కోరింది. దీనిపై మెటా అధిపతి మార్క్ జుకర్‌బర్గ్ వ్యక్తిగతంగా క్షమాపణ చెప్పాలని ప్యానెల్ ఛైర్మన్? నిషికాంత్ దుబే సోమవారం అన్నారు. కాగా, మెటా బాధ్యతను నిర్ధారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు ఇతర సభ్యులు డిమాండ్ చేశారు. సామాజిక, డిజిటల్ వేదికలు- వాటి నియంత్రణ' అనే అంశంపై చర్చించేందుకు బీజేపీ సభ్యుడు దుబే నేతృత్వంలోని కమిటీ ఈ సమావేశం నిర్వహించింది. ఈ పార్లమెంటరీ ప్యానెల్ సమావేశం మూడు గంటలకు పైగా జరిగింది. కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (మీవత్) కార్యదర్శి ఎస్. కృష్ణన్, స్నాప్‌చాట్, గూగుల్, ఎక్స్, మెటా (ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్), యూట్యూబ్ వంటి సామాజిక, డిజిటల్ మీడియా వేదికల ప్రతినిధులు కమిటీ ముందు హాజరయ్యారు. "ప్రధాని వీడియోను ఎందుకు తొలగించారు? ఇందుకు ఎవరు అనుమతి ఇచ్చారు? అభ్యంతరకరమైన ఇతర కంటెంట్‌ను ఆన్‌లైన్‌లో అలాగే ఉంచి ఈ వీడియోపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకున్నారు?" అని మెటా అధికారులను ప్రశ్నించారు. ఈ క్రమంలో పొరపాటు జరిగిందని మెటా అధికారులు క్షమాపణలు చెప్పారు. అయితే, క్షమాపణలు చెబితే సరిపోదని బాధ్యత వహించాలని ఎంపీలు చెప్పినట్లు తెలుస్తోంది. వీడియోను తాత్కాలికంగా తొలగించడానికి కారణమైన మెటా అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు డిమాండ్ చేసినట్లు సమాచారం. తమ ప్లాట్‌ఫారమ్‌లలో ఉన్న వివాదాస్పద, అభ్యంతరకరమైన కంటెంట్‌పై కంపెనీ తీసుకున్న చర్యల వివరాలను కూడా మెటాను సభ్యులు కోరినట్లు తెలుస్తోంది. మెటా భారతదేశం నుంచి భారీ ఆదాయాన్ని సంపాదిస్తున్నప్పటికీ, ఈ దేశ చట్టాలను పాటించడం లేదని ఎత్తి చూపారు. సోషల్ మీడియాలో అసమ్మతికి చోటు ఉండటం తప్పనిసరి అని, ప్రభుత్వ వ్యతిరేక కంటెంట్‌ను దేశద్రోహంగా పరిగణించకూడదని ప్యానెల్‌లోని ప్రతిపక్ష ఎంపీలు అన్నట్లు తెలుస్తోంది. "ఆ వీడియోను ఐదు గంటల పాటు తొలగించినట్లు వారే (మెటా) అంగీకరించారు. రాత్రి 12:30 నుంచి ఉదయం 5:00 గంటల వరకు అది అందుబాటులో లేకుండా పోయింది. ఇది చాలా తీవ్రమైన విషయం. ఇలా మెటా ఒక వీడియోను తొలగించడం ఇది మొదటిసారి కాదు. 2024లో మార్క్ జుకర్‌బర్గ్ పార్లమెంటరీ ఎన్నికల ఫలితాలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని అస్థిరపరచడమే వారి మనస్తత్వం. ప్రధానమంత్రి వీడియోను ఐదు గంటల పాటు తొలగించారు. వారు హోం వ్యవహారాలు, ఐటీ మంత్రిత్వ శాఖల ఆదేశాలను వినరు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియోను తొలగించినందుకు మార్క్ జుకర్‌బర్గ్ వ్యక్తిగతంగా క్షమాపణ చెప్పాలి. ఒకవేళ జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పకపోతే, సెక్షన్ 79 కింద వారికి ఉన్న సేఫ్ హార్బర్ రక్షణను వెనక్కి తీసుకోవాలి." అని దుబే అన్నారు. సమాచార సాంకేతిక చట్టంలోని ఈ నిబంధన ప్రకారం, సోషల్ మీడియా నెట్‌వర్క్‌లు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు తమ ప్లాట్‌ఫారమ్‌లోని థర్డ్-పార్టీ కంటెంట్‌కు చట్టపరంగా బాధ్యత వహించరు.

### ఇంతకీ ఏం జరిగింది?

నీట్ - యూజీ 2026 పరీక్షల అక్రమాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలో విద్యార్థులు ఢిల్లీలోని జంతర్ మంతర్? వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలోనే జులై 23న ప్రధాని మోదీ మొదటిసారిగా నేరుగా యువతను ఉద్దేశించి ఫేస్?బుక్? వేదికగా మాట్లాడారు. అందులో పరీక్ష పేపర్ లీకేజీలకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఇందుకోసం మరింత కఠినమైన చట్టపరమైన నిబంధనలను కేంద్ర మంత్రివర్గం ముందుకు తీసుకువస్తామని తెలిపారు. అయితే ఫేస్ బుక్ జులై 28 తెల్లవారుజామున ఈ వీడియో యాక్సెస్?ను కొద్దిసేపు నిలిపివేసింది. ఫలితంగా మోదీ పెట్టిన వీడియో పోస్టు కనిపించకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వం ఈ చర్యను తీవ్రంగా పరిగణించింది. ప్రధాని మోదీ పోస్టు ఎందుకు తొలగించారో చెప్పాలంటూ, మెటా గ్లోబల్ పబ్లిక్? పాలసీ హెడ్?కు ఐటీ మంత్రిత్వశాఖ సమన్లు జారీ చేసింది. దీంతో దిగి వచ్చిన మెటా కేంద్ర ప్రభుత్వానికి క్షమాపణ చెప్పింది. "ప్రధాని నరేంద్ర మోదీ వీడియోను పొరపాటున తొలగించడం జరిగింది. ప్రస్తుతం దీనిని తిరిగి పునరుద్ధరించాం" అని మెటా ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు.

# కర్ణాటకలో కాంగ్రెస్‌లో కలకలం

మొదటిపేజీ తరువాయి – తర్వాత మరో విడత మంత్రివర్గ విస్తరణ చేపట్టగా.. ఆ పార్టీలో తీవ్ర సంక్షోభం ఏర్పడింది. మంత్రివర్గంలో స్థానం ఆశించిన ఎమ్మెల్యేలు అవకాశం లభించకపోవడంతో వారంతా తీవ్ర నిరాశ చెందారు. మంత్రి పదవి లభించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి లోనయిన ఇద్దరు ఎమ్మెల్యేలు రాజీనామా చేయగా.. మరికొందరు ఎమ్మెల్యేలు రాజీనామా చేయడానికి సిద్ధమయ్యారు. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర కలకలం రేపాయి. కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో మరో తీవ్ర సంక్షోభం వచ్చింది. ముఖ్యమంత్రి పదవి మార్చిన కొన్ని నెలలకే అధికార కాంగ్రెస్ పార్టీలో ముసలం ఏర్పడింది. పార్టీ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఓ ఎమ్మెల్యే రాజీనామా చేయడం సంచలనం రేపుతోంది. మరో పది మంది ఎమ్మెల్యేలు కూడా రాజీనామా చేయనున్నారనే వార్తతో కన్నడ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో కర్ణాటక రాజకీయాల్లో ఏం జరుగుతుందో తెలుసుకుందాం. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా ఓ ఎమ్మెల్యే రాజీనామా చేయగా అదే దారిలో మరో పది మంది రాజీనామా చేయనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కేబినెట్ విస్తరణతో నిరాశ చెంది ఎమ్మెల్యే పదవికి విజయపుర కాంగ్రెస్ ఎమ్మెల్యే యశ్వంత్రయ గౌడ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఆమోదం కోసం స్పీకర్‌కు పంపారు. రేపు ఉదయం 10 గంటలకు బేలూరు ఎమ్మెల్యే గోపాలకృష్ణ కూడా రాజీనామా చేయనున్నారు. మరో పది మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయనున్నట్టు తెలియడంతో రాజకీయాలు హాట్‌హాట్‌గా మారాయి. 'నేను నాలుగు దశాబ్దాలుగా కర్ణాటక రాజకీయాల్లో ఉన్నా. నాకు ఆవేదన కలిగింది' అని యశ్వంతరాయ పాటిల్ తెలిపారు. అయితే కాంగ్రెస్ పార్టీని వీడటంపై తాను ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. 'నేను ఎమ్మెల్యే పదవికి, రాష్ట్ర అటవీ పరిశ్రమల సంస్థ చైర్మన్ పదవికి రాజీనామా చేయబోతున్నా. ముఖ్యమంత్రులు లేదా మంత్రుల పిల్లలైతేనే మీకు మంత్రి అయ్యే అవకాశం లభిస్తుంది. నేను ఎమ్మెల్యే పదవికి, నాకు కేటాయించిన బోర్డు చైర్మన్ పదవికి రాజీనామా చేస్తా' అని ఎమ్మెల్యే బేలూరు వేణుగోపాల్ తెలిపారు. రాజీనామాల విషయమై ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. 'చాలా మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అందరికీ పదవులు ఇవ్వడం సాధ్యం కాని విషయం. గతంలో సిద్ధరామయ్య మంత్రివర్గంలో నాకు కూడా మంత్రి పదవి దక్కలేదు. కానీ ఆ తర్వాత నేను మంత్రిని అయ్యాను కదా? అదేవిధంగా భవిష్యత్తులో అందరికీ అవకాశాలు కల్పిస్తాం. ప్రస్తుతం నేను లోక్ భవన్‌కు వెళ్తున్నా' అని సీఎం శివకుమార్ తెలిపారు.

# సీఎం విజయ్‌కు తొలి అగ్నిపరీక్ష.. కావేరి జలాలపై రాజకీయ రగడ!



మొదటిపేజీ తరువాయి – దశాబ్దాలుగా నలుగుతున్న కావేరి జలాల వివాదం విషయంలో ఆయన వైఖరి ఇప్పుడు రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ఆయన ప్రభుత్వం తిరస్కరించడంతో రాజకీయ వేడి రాజుకుంది. కావేరి సమస్యపై వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్ష డీఎంకే, ఇతర పార్టీలు ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయి. అయితే, ఈ డిమాండ్‌ను విజయ్ నేతృత్వంలోని టీవీకే (తమిళగ వెట్రి కళగం) ప్రభుత్వం తోసిపుచ్చింది. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలు ఈ అంశాన్ని వాడుకుంటున్నాయని, రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదని ఆరోపిస్తోంది. ఈ విషయంపై టీవీకే సీనియర్ నేత సీటీఆర్ నిర్మల్ కుమార్ స్పందిస్తూ.. "ఇప్పటికే అసెంబ్లీలో అన్ని పార్టీల మద్దతుతో ఏకగ్రీవంగా తీర్మానం చేశాం. అలాంటప్పుడు మళ్లీ అఖిలపక్ష సమావేశం ఎందుకు? కేవలం మా ముఖ్యమంత్రికి సమస్యలు సృష్టించాలనే డీఎంకే చూస్తోంది తప్ప, తమిళనాడు సంక్షేమం వారికి పట్టదు" అని విమర్శించారు. గతంలో కావేరి వివాదం తీవ్రమైనప్పుడు డీఎంకే, ఏఐఏడీఎంకే ప్రభుత్వాలు అఖిలపక్ష సమావేశాలు నిర్వహించాయి. కానీ, టీవీకే ప్రభుత్వం భిన్నమైన వ్యూహంతో ముందుకెళ్తున్నట్లు కనిపిస్తోంది. వాస్తవానికి ఈ సమస్యపై చర్చించేందుకు సీఎం విజయ్ నేరుగా బెంగళూరు వెళ్లి కర్ణాటక ముఖ్యమంత్రితో మాట్లాడాలని భావించినా, అక్కడి ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఆ పర్యటన రద్దయినట్లు సమాచారం. ప్రభుత్వ వైఖరికి నిరసనగా నేడు (ఆగస్టు 3న) తంజావూరులో రైతుల సమస్యలు, కావేరి అంశంపై భారీ నిరసన చేపట్టాలని డీఎంకే నిర్ణయించింది.

## ఎన్నికల వ్యూహకర్తగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే) బిహార్ రాజకీయాల్లో సంచలనం సృష్టించారు

**నిజం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు,3:** బీజేపీకి కంచుకోటగా పేరున్న బాంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికలో ఘన విజయం సాధించి తన పార్టీకి తొలి ఎన్నికల విజయాన్ని అందించారు. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై సుమారు 18,953 ఓట్ల మెజారిటీతో విజయం సాధించిన పీకే, 35 ఏళ్లుగా కొనసాగుతున్న బీజేపీ ఆధిపత్యానికి తెరదించారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచే ఆధిక్యంలో కొనసాగిన ప్రశాంత్ కిశోర్ చివరి వరకు అదే జోరు కొనసాగించారు. ఈ విజయంతో జన్ సురాజ్ పార్టీ తొలిసారిగా శాసనసభలో అడుగుపెట్టడంతో పాటు, రాబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేపింది. బీజేపీకి కంచుకోటగా బాంకీపూర్ బాంకీపూర్ నియోజకవర్గం చాలా కాలంగా బీజేపీకి బలమైన స్థావరంగా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ స్థానం నుంచి బీజేపీ సీనియర్ నాయకుడు నితిన్ నబీన్ విజయం సాధించారు. 2006 నుంచి వరుసగా ఈ స్థానాన్ని ఆయన నిలబెట్టుకున్నారు. అయితే ఇటీవల ఆయన పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లారు. దీంతో ఖాళీ అయిన ఈ స్థానానికి జూలై 30న ఉపఎన్నిక నిర్వహించగా, సోమవారం ఫలితాలు వెలువడ్డాయి.

## డబ్ల్యూహెచ్ఓ షాకింగ్ రిపోర్ట్: తెలంగాణలో 55 వేల మంది నర్సుల కొరత - వైద్య సేవలపై తీవ్ర ప్రభావం



**నిజం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 3:** రాష్ట్ర వైద్యారోగ్య రంగంలో నర్సుల కొరత తీవ్రంగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్ఓ విడుదల చేసిన తాజా నివేదిక వెల్లడించింది. ఈ నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజలకు షాక్ ఇచ్చింది. డబ్ల్యూహెచ్ఓ నివేదిక ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో సుమారు 55 వేల మంది నర్సుల కొరత ఉంది. అవసరమైన దానికంటే సగానికి పైగా సిబ్బంది లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రుల్లో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఒక్కో నర్సుపై రెట్టింపు భారం ప్రస్తుతం ఉన్న నర్సులు అదనపు డ్యూటీలు చేయాల్సి వస్తుండటంతో వారిపై పని భారం విపరీతంగా పెరిగింది. దీంతో రోగులకు సకాలంలో సేవలు అందించడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా మాతా శిశు సంరక్షణ, ఐసీయూ, ఎమర్జెన్సీ వార్డుల్లో నర్సుల కొరత మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

**వైద్య రంగంపై ప్రభావం**

1. రోగి-నర్సు నిష్పత్తి దెబ్బతింది డబ్ల్యూహెచ్ఓ ఓ ప్రమాణాల ప్రకారం 1 నర్సు 4-5 మంది రోగులను చూసుకోవాలి. కానీ తెలంగాణలో ఒక్కో నర్సు 10-15 మంది రోగులను చూడాల్సి వస్తోంది.
2. సేవల్లో జాప్యం: ఇంజెక్షన్లు, మందులు ఇవ్వడం

## కొత్త టెక్నాలజీతో ఇంటర్ మెమోలు.. ఈ నెల 15లోగా పంపిణీ




**నిజం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 3:** కొత్త టెక్నాలజీతో ఇంటర్ మెమోలు.. ఈ నెల 15లోగా పంపిణీ తెలంగాణ : ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇకపై చిరగని, తడవని నాన్ టియరబుల్ మెమోలు అందనున్నాయి. ఈ ఏడాది నుంచే ఈ కొత్త సాంకేతికతతో కూడిన మెమోలను అందించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. సుమారు 4 లక్షల మంది సెకండియర్ పాసైన విద్యార్థులకు ఆగస్టు 15లోగా వీటిని పంపిణీ చేయాలని బోర్డు చర్యలు చేపడుతోంది. గతంలో వర్షాలు, వరదల వల్ల మెమోలు పాడైపోవడం, విద్యార్థులు ఇబ్బందులు పడటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతేకాకుండా, మెమోలపై విద్యార్థుల కలర్ ఫొటోలను ముద్రించడం ద్వారా నకిలీ సర్టిఫికెట్లను అరికట్టాలని బోర్డు భావిస్తోంది.

## రేపటి నుంచి నీట్- యూజీ కౌన్సిలింగ్!




**నిజం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 3:** దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్, వంటి మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు కీలక అప్డేట్, నీట్ -యూజీ, 2026 అడ్మిషన్ల కోసం అధికారిక కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఆల్ ఇండియా కోట ఏఐక్యూ,సెంట్రల్ యూనివర్సిటీతో పాటు రాష్ట్ర కోట కౌన్సిలింగ్ కు సంబం ధించిన ముఖ్యమైన అధికారిక తేదీలను ప్రకటించింది.ఈనెల ఆగస్టు 4వ తేదీ నుంచి తొలి రౌండు కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది,ఆగస్టు 5 నుంచి 12వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు పేమెంట్ చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపింది. ఆగస్టు 6 నుంచి 13వ తేదీ వరకు ఛాయిస్ ఫిల్లింగ్/ లాకింగ్,ఆగస్టు 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నీట్ అలాట్ మెంట్ ,ఆగస్టు 17న తొలి రౌండు ఫలితాలను ప్రకటిస్తారు. సీట్లు సాధించిన విద్యార్థు లు ఆగస్టు 18 నుంచి 22 వరకు రిపోర్టింగ్ చేయవలసి ఉంటుంది.

## ఓబీసీ మోర్చా నూతన పదాధికారులను సన్మానించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు




**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 3:** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా (అర్బన్) భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులుగా ఫతేనగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు యాదగిరి , కూకట్‌పల్లి నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్‌గా బాలాజీ నగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు జి. వినోద్ కుమార్ గౌడ్ నియమితులైన సందర్భంగా, వారు సోమవారం రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు నూతనంగా నియమితులైన ఇద్దరు నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ గుర్తించి తగిన గౌరవం కల్పిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా, బీసీ వర్గాల సంక్షేమానికి ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారు అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, పార్టీ సిద్ధాంతాలను ఇంటింటికీ చేర్చాలని సూచించారు. అందరినీ కలుపుకొని సమిష్టిగా పనిచేస్తూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు సి.హెచ్. శ్రీనివాస్ గౌడ్, అత్తికరి మల్లేష్, సతీష్ గౌడ్, ఎమ్.ఎస్ రెడ్డి, సూరిబాబు, సంతోష్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఇతర పార్టీల పై వ్యతిరేకత బీఆర్ఎస్‌లోకి వలసలు

**రోజురోజుకూ పుంజుకుంటున్న గులాబీ పార్టీ బలం**

**కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాదాపూర్ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు మదనాచారి**

**మాధవరం కృష్ణారావు ప్రోద్బలంతో బొబ్బ నవత రెడ్డి సహకారం తో,శ్రీనివాస్ గౌడ్,రాయల కార్తిక్ సమక్షంలో మాదాపూర్ డివిజన్ లో చేరికలు**



**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, ఆగస్టు 3:** నియోజకవర్గంలో ఇతర పార్టీలు పై వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. బీఆర్ఎస్ పార్టీకి అనూహ్యంగా బలం పెరుగుతోంది. క్షేత్రస్థాయిలో చోటుచేసుకుంటున్న పరిణామాలతో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఒక్కొక్కరుగా గులాబీ గూటికి క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. తాజాగా మాదాపూర్ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు మదనాచారి సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

**కేటీఆర్ చేతుల మీదుగా..**

కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు అండదండలతో,బొబ్బ నవత రెడ్డి సహకారం తో,శ్రీనివాస్ గౌడ్, కార్తిక్ ఆధ్వర్యంలో మాదాపూర్ బీ. జే. పి మాజీ అధ్యక్షుడు మదనాచారి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) స్వయంగా ఆయనకు బీఆర్ఎస్ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా నాయకులంతా సమన్వయంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా కే. టీ. ఆర్ సూచించారు. ఈ చేరికల కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ నాయకులు లక్ష్మణ్, నరేందర్ రెడ్డి, అభినంద్,తదితరులు పాల్గొన్నారు.

# అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు ప్రాతినిధ్యం ఇవ్వాలి

**-రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు**

**-జర్నలిస్టుల హక్కులకు మరోసారి న్యాయస్థానం అండ**

**-ఇది మా టీడబ్ల్యూజేఎఫ్ సభ్యుల విజయం**

**-రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**




**నిజం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు 03:** రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)ల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)కు ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు విషయంలో జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరాన్ని హైకోర్టు స్పష్టం చేసింది. అన్ని అర్హులున్న టీడబ్ల్యూజేఎఫ్ కు అక్రెడిటేషన్ కమిటీల్లో ప్రాతినిధ్యం ఇవ్వకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలను ఏర్పాటు చేసే సమయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌కు ప్రాతినిధ్యం ఇవ్వకుండా వ్యవహరించడాన్ని సవాల్ చేస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు దాఖలైన రిట్ పిటిషన్‌పై గత ఆరు నెలలుగా పలుమార్లు విచారణ జరిగింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ కార్యాలయ న్యాయవాదులు, పిటిషనర్ తరఫున న్యాయవాదులు తమ వాదనలు కోర్టు ముందు వినిపించారు.ఇరుపక్షాల వాదనలు, ప్రభుత్వ ఉత్తర్వులు, మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు విధానం, జర్నలిస్టు సంఘాల ప్రాతినిధ్యానికి సంబంధించిన నిబంధనలను పరిశీలించిన అనంతరం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ మొహినుద్దీన్‌ల ధర్మాసనం సోమవారం తీర్పును వెలువరించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు కూడా తగిన ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ తీర్పుతో రాష్ట్రంలోని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌కు అధికారిక ప్రాతినిధ్యం లభించే మార్గం సుగమమైంది. జర్నలిస్టు సంఘాల మధ్య సమాన అవకాశాలు, పారదర్శకత, న్యాయబద్ధమైన ప్రాతినిధ్యానికి ఈ తీర్పు దోహదపడుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. హైకోర్టు తీర్పును తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించింది. జర్నలిస్టుల హక్కులు, గౌరవం, సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలన్న తమ పోరాటానికి ఇది న్యాయపరమైన విజయమని పేర్కొంది. ఈ తీర్పును వెంటనే అమలు చేసి, అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సంఘం నాయకులు కోరారు. ఈ తీర్పు భవిష్యత్తులో మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటులో అన్ని గుర్తింపు పొందిన జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాధాన్యం కల్పించేలా మార్గదర్శకంగా నిలుస్తుందని జర్నలిస్టు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. న్యాయం, ధర్మం తమవైపు ఉందని, హైకోర్టు ఇచ్చిన తీర్పు తమ సంఘం సభ్యుల విజయం అని రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పేర్కొన్నారు.

## నిజాంపేట్ వాటర్ బోర్డులో జరుగుతున్న అవకతవకలను సరిచేయాలి.-సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్



**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 3:** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని నిజాంపేట్ వాటర్ బోర్డులో జరుగుతున్న అవకతవకల పై సిపిఐ ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ పరమీలకు, డూప్యూటీ జనరల్ మేనేజర్ రజినీకాంత్ రెడ్డికీ పిర్యాదు చేయడం జరిగింది. అనంతరం సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని వికార్ సెక్షన్లో ఇందిరమ్మ కాలనీ, రాజీవ్ గృహకల్ప, డబుల్ బెదురూమ్స్, ఇంద్రన్న కాలనీ, ఎన్టీఆర్ నగర్, సాయి నగర్, రాజీవ్ గాంధీ నగర్లో మంచి నీళ్ల సరఫరా సరిగా జరగటం లేదు అని గుర్తు చేశారు. పై కాలనిలో పాత మోటార్లు సరిగా పని చేయటం లేదు. అలాగే ఇందిరమ్మ కాలనిలో సబ్ వాల్స్ పాత అవ్వటం వల్ల సరిగా పని చేయటంలేదు. వాటిని వెంటనే రిపేర్ చేయాలనీ వారు డిమాండ్ చేశారు. అలాగే రాజీవ్ గృహకల్ప నుండి విజయ్ టింబర్ విల్స్ వరకు 200మీ.మీ వాటర్ పైప్ లైన్ కీ కలెక్షన్ ఇవ్వడం వల్ల మెన్ లైన్ కలెక్షన్ వారికీ నాలుగు నుండి ఐదు గంటలు మంచి నీళ్ల సప్లై వస్తుంది. మిగతా వారికీ గంట, అర్ధ గంట మాత్రమే నీళ్లు సప్లై వస్తుంది. అని అన్నారు. అలాగే సర్వే నెంబర్- 90లో కట్టిన నిర్మాణాలకు కూడా అక్రమంగా వన్ ఇంచ్ కలెక్షన్ ఇచ్చారని వాటిని వెంటనే తొలగించాలని వారు. డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం ఆశి. యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, సమరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## "నూతన ఫుడ్ కోర్టు ప్రారంభోత్సవం"



**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, ఆగస్టు 3:** ఆల్విన్ కాలనీ డివిజన్‌లోని ఎల్లమ్మబండ గుడ్‌విల్ చౌరస్తా వద్ద మహమ్మద్ థయ్యర్ నూతన ఫుడ్ కోర్టు ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్" వి. జగదీశ్వర్ గౌడ్, ఆల్విన్ కాలనీ 124వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు "పట్వారీ శశిధర్"తో కలిసి రిబ్బన్ కత్తిరించి ఫుడ్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా మహమ్మద్ థయ్యర్"కి నూతన వ్యాపార ప్రారంభానికి హృదయపూర్వక శు భాకాంక్షలు తెలియజేస్తూ, వారి ఫుడ్ కోర్టు ప్రజల విశ్వాసాన్ని మెరుగు పడుచుకొని, రోజురోజుకూ అభివృద్ధి చెందాలని, వ్యాపార రంగంలో విశేష విజయాలు సాధించాలని, మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.వి.ఆర్, గౌస్ భాయ్, సాంబా, యలమంచి ఉదయ్, శ్రీమతి శిరీష సంతూర్, రమాదేవి, జి. రవి, ఎండి నవాజ్ ఖాన్, ఎండి ఖైసర్ భాయ్, ఎం.డి అబ్దుల్, ఖలీల్, షెంషు, ఇంతియాజ్, ఎం.డి రెహమాన్, ప్రభాకర్, సంగమేష్, బాబ్జీ, టీం పట్వారీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గొరిగే వెంకటేష్ చిత్రపటానికి ఘన నివాళులు



**నిజం న్యూస్ ప్రతినిధి, ఉప్పల్, ఆగస్టు 3 :** భారతీయ జనతా పార్టీ యువ నాయకుడు ఉప్పల్ గొరిగే వెంకటేష్ దశదిన కర్మ సంతాప సభ కార్యక్రమం సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తూ ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గొరిగే పెంటయ్య, తెలంగాణ కురుమ సంఘం ఉపాధ్యక్షులు గొరిగే రమేష్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొరిగే కృష్ణ, ప్రముఖ న్యాయవాది గొరిగే మల్లేష్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్, రాష్ట్ర పీసీసీ కార్యదర్శి శివకుమార్, బండారు వెంకట్రావు,రావుల బాలకృష్ణ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గొరిగే వెంకటేష్ పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు అంకితభావంతో కృషి చేసిన యువ నాయకుడని కొనియాడారు. ఆయన అకాల మరణం పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అలాగే, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## చిత్తారమ్మ , పోచమ్మ బోనాలకు పకడ్బందీ ఏర్పాట్లు.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలి కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి ఆగస్టు 3:** ఈ ఆదివారం జరుగు కూకట్పల్లి చిత్తారమ్మ బోనాలు, మూసాపేట పోచమ్మ దేవాలయం వద్ద బోనాలకు సంబంధించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం కూకట్పల్లి రామాలయంలోని అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు... ప్రధానంగా ట్రాఫిక్, శానిటేషన్ ,విద్యుత్ శాంతిభద్రతలు మొదలగు విషయాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని ..అలాగే అమ్మవార్లకు జరిగే కైంకర్యాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పూజారులు కూడా సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని భక్తులకు ప్రాధాన్యమిస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు.. శానిటేషన్ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుని ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పరిశుభ్రత పాటించే విధంగా చూడాలని జిహెచ్ఎంసి అధికారులకు తెలిపారు.. ఎటువంటి ఇబ్బంది ఉన్న ఎడల తన దృష్టికి తీసుకురావాలని ప్రతిక్షణం పర్యవేక్షించాలని అన్నారు... ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఆలయ మాజీ చైర్మన్లు సూర్యారావు, హిమగిరిరావు, ఆనందరావు, నాయనేని తులసీరావు, నాగరాజు, ప్రభాకర్ ,విష్ణు చైతన్య, సంతోష్ ,మహేష్ అన్ని విభాగాల అధికారులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
మంగళవారం 04-08-2026

# డీమార్ట్ టాప్ ఆ తర్వాత జొమాటో, స్విగ్గీ

స్వయంకృషితో ఎదిగిన దేశీయ కంపెనీల జాబితా ప్రకటించిన హురున్




రాధాకిషన్ దమానీ నేతృత్వంలోని సూపర్‌మార్కెట్ బ్రాండ్ డీమార్ట్.. దేశంలోనే స్వయంకృషితో ఎదిగిన సంస్థల్లో అత్యంత విలువైనదని బుధవారం విడుదలైన జాబితాలో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ప్రైవేట్, హురున్ ఇండియా పేర్కొన్నాయి. సెల్ఫ్-మేడ్ ఎంటర్‌ప్రెన్యూర్ ద్వారా 2000వ సంవత్సరం తర్వాత ఏర్పడ్డ 200 కంపెనీలతో ఓ లిస్ట్‌ను ఐడీఎఫ్‌సీ ఫస్ట్, హురున్ తయారు చేశాయి. ఇందులో రూ.3.42 లక్షల కోట్ల విలువతో డీమార్ట్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఏడాది డీమార్ట్ యాజమాన్య సంస్థ అవెన్యూ సూపర్‌మార్కెట్స్ విలువ 44 శాతం పుంజుకున్నట్టు తెలిపింది. ఇక డీమార్ట్ తర్వాత ఫుడ్ డెలివరీ యాప్స్ జొమాటో, స్విగ్గీ ఉన్నాయి.

# ఎస్బీఐ ఎండీగా రామమోహన్ రావు




దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) మేనేజింగ్ డైరెక్టర్‌గా రామమోహన్‌రావు అమర నియమితులయ్యారు. గుంటూరు జిల్లాకు చెందిన రామ మోహన్ రావు.. ఈ పదవిలో మూడేండ్లపాటు కొనసాగనున్నారు. ఇప్పటికే బ్యాంక్ డిప్యూటీ ఎండీగా విధులు నిర్వహిస్తున్న రావుకు పదోన్నతి లభించినట్లు అయింది. గతంలో ఎండీగా విధులు నిర్వహించిన సీఎస్ శెట్టి ఛైర్మన్‌గా పదోన్నతి పొందడంతో ఈ పోస్ట్ ఖాళీ అయింది. దీంతో శెట్టి స్థానంలో కొత్తగా రామ మోహన్ రావు ఎంపికచేసింది బ్యాంక్ బోర్డు.

# రూపాయి బేజారు

మరో మూడు పైసలు కోల్పోయి 84.94కి పడిపోయిన విలువ



రూపాయికి మరిన్ని చిల్లులు పడ్డాయి. రోజుకొక కనిష్ఠ స్థాయికి జారుకుంటున్న విలువ బుధవారం చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడం, వడ్డీరేట్ల తగ్గింపుపై అమెరికా ఫెడరల్ రిజర్వు తీసుకునే నిర్ణయం కోసం ట్రేడర్లు వేచి చూసే దోరణిలో ఉండటంతో కరెన్సీ మరింత పతనమైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 3 పైసలు పతనం చెంది చారిత్రక కనిష్ఠ స్థాయి 84.94కు జారుకున్నది. దిగుమతిదారులు, విదేశీ బ్యాంకుల నుంచి డాలర్‌కు అనూహ్యంగా మద్దతు లభించడంతోపాటు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా తమ నిధులను తరలించుకుపోవడం మార్కెట్లో మదుపరుల సెంటిమెంట్‌ను నిరాశపరిచింది. 84.92 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్చేంజ్ రేటు ఇంట్రాడేలో 84.95 కనిష్ఠ స్థాయికి జారుకున్నది. చివరకు మూడు పైసలు నష్టపోయి 84.94 వద్ద ముగిసింది. మంగళవారం కూడా కరెన్సీ 84.91కి పడిపోయిన విషయం తెలిసిందే. దేశీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ఉండటం, రెండో త్రైమాసికంలో భారత వృద్ధిరేటు మందగించడంతో రూపాయిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదని మిరాయ్ అసెట్ షేర్‌ఖాన్ రీసర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరీ తెలిపారు. డాలర్ మరింత బలోపేతంకావడం, ఎఫ్ఐఐలు భారీగా నిధులను ఉపసంహరించుకోవడం కూడా పతనానికి ఆజ్యంపోసిందన్నారు. అమెరికా కరెంట్ ఖాతా లోటు, గృహాల విక్రయాల డాటా విడుదలకానుండటం మదుపరులు వేచిచూసే దోరణి అవలంభిస్తున్నట్లు చెప్పారు. ఇలాగే కొనసాగితే త్వరలో రూపాయి 85.20 స్థాయికి పడిపోయే ప్రమాదం ఉన్నదని ఆయన హెచ్చరించారు. రూపాయి భారీగా పతనంకావడంతో దిగుమతులకోసం భారీగా నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. ఇప్పటికే దిగుమతులు కోసం అధికంగా నిధులు వెచ్చిస్తున్న కేంద్రానికి రూపాయి గుదిబండగా మారింది.

# పసిడి కొనుగోలుదారులకు బిగ్ రిలీఫ్ తులం ధర ఎంత పలుకుతుందంటే



పసిడి ధరలు కొనుగోలుదారులకు ఊరటనిచ్చాయి. దేశవ్యాప్తంగా బంగారం ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టగా.. వెండి ధర స్వల్పంగా పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర నిలకడగా కొనసాగుతున్నది. ఈ క్రమంలో దేశీయ మార్కెట్‌లో పుత్తడి ధర పతనమైంది. దేశ రాజధాని ఢిల్లీలో పది గ్రాముల బంగారంపై రూ.200 తగ్గి తులానికి రూ.79,100కి చేరిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. గత మూడురోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం బుధవారం రూ.500 పెరిగి.. కిలో ధర రూ.92వేలకు ఎగిసింది. ప్రస్తుతం బంగారం విషయంలో పెట్టుబడిదారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనున్నది. అయితే, ఈ సారి వడ్డీ రేట్లలో కోత విధించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో పెట్టుబడిదారులు బంగారంపై పెట్టుబడుల విషయంలో అప్రమత్తం వ్యవహరిస్తున్నారు. ఎంసీఎక్స్‌లో గోల్డ్ రేటు రూ.74 పెరిగి.. పది గ్రాముల ధర రూ.76,945కి చేరుకుంది. ఫెడ్ రిజర్వ్ నిర్ణయంపై బంగారం ధరలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. ఇక వెండి ధర ఎంసీఎక్స్‌లో కిలోకు రూ.90,830కి చేరింది. ఆసియా ట్రేడింగ్ సెషన్‌లో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్ 0.08శాతం పెరిగి ఔన్స్‌కు 2,664.10 డాలర్లకు చేరుకుంది. యూఎస్ రిటైల్ సేల్స్ ఊహించినదాని కంటే మెరుగ్గా ఉన్న నేపథ్యంలో బంగారం ధరలు తగ్గాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ (కమోడిటీస్) సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. గ్లోబల్ మార్కెట్‌లో వెండి ఔన్స్‌కు 30.92 డాలర్ల వద్ద స్థిరంగా ఉన్నది. ఇక దేశంలోని వివిధ నగరాల్లో బంగారం ధరలను పరిశీలిస్తే.. ముంబయిలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.71,350 ఉండగా.. 24 క్యారెట్ల పసిడి ధర రూ.77,840 పలుకుతున్నది. చెన్నైలో 22 క్యారెట్స్ గోల్డ్ రూ.71,350 ఉండగా.. 24 క్యారెట్ల స్వర్ణం రూ.77,840 వద్ద కొనసాగుతున్నది. హైదరాబాద్‌లో 22 క్యారెట్స్ గోల్డ్ రూ.71,350 ఉండగా.. 24 క్యారెట్ల పసిడి రూ.77,840 పలుకుతున్నది.

# లోపాలను సరి చేసి సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలి : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి




**నిజం న్యూస్ హైదరాబాద్, ఆగస్టు, 3:** రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ నాణ్యతను మెరుగుపరచేందుకు ఫొటోలు లేకపోవడం, జన్మతేదీ వ్యత్యాసాలు, లింగ వివరాల్లో పొరపాట్లు, సంతకాలలో లోపాలను సరి చేసి సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా.వాసం వెంకటేశ్వర్ రెడ్డి ఐఎఎస్ తో కలిసి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సంబంధించిన ప్రతిపాదనలు, వాటి డిజిటైజేషన్ పురోగతి, సంబంధిత అంశాలను సమీక్షించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ముఖ్యంగా గైర్హాజరైన, నివాసం మార్చుకున్న, మరణించిన, నకిలీ, ఓటర్ల ఏ ఎస్ డి డి, జాబితాల పునఃపరిశీలన, విశ్లేషణ, నో మాఫింగ్, కేసులు, తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని ఆయన సూచించారు.

**ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి కింది కీలక ఆదేశాలు జారీ చేశారు:**

ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఉన్న అన్ని లోపాలను అత్యంత ఖచ్చితత్వంతో సరిదిద్దాలి.

అన్ని ఏ ఎస్ డి డి కేసులను తుది నిర్ణయానికి ముందు పునఃపరిశీలించి, సరైన వర్గీకరణ చేయాలి. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా లేదా పొరపాటున తొలగించబడకుండా చర్యలు తీసుకోవాలి.

లోపాలు గుర్తించిన సందర్భంలో రోల్ బ్యాక్ సదుపాయాన్ని వినియోగించి, రికార్డులను మళ్లీ పరిశీలించి అవసరమైన సవరణలు చేయాలి.

బూత్ లెవల్ అధికారుల, బూత్ లెవల్ సూపర్వైజర్లు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు ద్వారా క్షేత్రస్థాయి ధృవీకరణను మరింత బలోపేతం చేయాలి. నిర్లక్ష్యం గుర్తించిన చోట క్రమశిక్షణ చర్యలు ప్రారంభించాలి.

బూత్ లెవల్ అధికారులతో నిర్వహించిన సమావేశాల మినిట్స్‌ను, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల సంతకాలతో సిద్ధం చేసి, వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలి.

85 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు గల ఓటర్లకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. వారికి సంబంధించిన వ్యత్యాసాలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడంతో పాటు, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిర్దేశిత గడువులో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలి. ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు పోలింగ్ కేంద్రాలకు విభజించబడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అలాగే, జీహెచ్ఎంసీ కమిషనర్ ఓ హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, అన్ని పట్టణ జిల్లాల జిల్లా ఎన్నికల అధికారుల పురోగతిని ప్రధాన ఎన్నికల అధికారి సమీక్షించారు. నో మాఫింగ్ కేసులు, ఏఎస్ డిడి కేసులు, అసంగతతలు, సేకరించని ఎన్యూమరేషన్ ఫారాలు , ఇతర పెండింగ్ అంశాల పరిష్కారానికి సంబంధించి వారి కార్యాచరణ ప్రణాళికలను తెలుసుకుని, దోషరహిత ఓటరు జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ప్రభుత్వ సాధారణ పరిపాలన (ఎన్నికలు) శాఖ అదనపు కార్యదర్శి శ్రీ ఎన్. శంకర్, ఉప ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫ్ఏసీ) జి.ఎస్. చారి, రాష్ట్రంలోని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ ఓ హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్ఓలు), నోడల్ అధికారులు, సంబంధిత సెక్షన్ అధికారులు మరియు ప్రాజెక్ట్ మేనేజర్ (ఐటీ) తదితరులు పాల్గొన్నారు.

# ఇది ఎకో షో!!










మనిషి వినూత్న ఆలోచనలు ఒకవైపు.. అత్యాధునిక టెక్నాలజీ మరో వైపు. ఇంకేముందీ.. ఆవిష్కరణలకు అంతేలేదు. ప్రతి చిన్న అవసరానికీ ఓ యంత్రాన్ని తయారు చేసేస్తున్నాడు. కావాలంటే ఈ డివైజ్‌ని చూడండి. దీని పేరు అమెజాన్ ఏకో షో 21. ఇదో కొత్త స్మార్ట్ డిస్‌ప్లే. చూడ్డానికి కంప్యూటర్ మానిటర్‌లా ఉందని అనుకోవద్దు. ఇది అమెజాన్ సంస్థ రూపొందించిన ప్రత్యేక డిస్‌ప్లే డివైజ్. ఇంట్లో పలు అవసరాల్ని దృష్టిలో పెట్టుకుని దీన్ని తీర్చిద్దారు. ఇదేం చేస్తుంటే.. మీకు ఎంటర్‌టైన్మెంట్ కావాలంటే.. టీవీలా మారిపోతుంది. ఇంటికి రక్షణ కల్పించే వెబ్ కెమెరాలా పని చేస్తుంది. వీడియోలు షూట్ చేసే వీడియో కెమెరాలా రూపుదాలుస్తుంది. ఇంకా చెప్పాలంటే.. ఆఫీస్ కాన్ఫరెన్స్ కాల్స్ మాట్లాడే ప్రొఫెషనల్ డివైజ్‌లానూ పని చేస్తుంది. ఈ పరికరం తాకే తెర పరిమాణం 21 అంగుళాలు. ఇంటి నిర్వహణను మరింత సులభతరం చేస్తుంది. దీంట్లోని 13 మెగాపిక్సెల్ వైడ్ యాంగిల్ కెమెరాతో గది మొత్తాన్ని చిత్రీకరించొచ్చు. వీడియో కాల్స్ కోసం మెరుగైన ఫ్రేమింగ్‌ను అందిస్తుంది. 65% ఎక్కువ జూమ్, డబుల్ ఫీల్డ్ ఆఫ్ వ్యూతో.. మీరు కిచెన్‌లో కదులుతున్నప్పుడు కూడా ఎప్పుడూ ఫ్రేమ్‌లోనే ఉంటారు. అంతేకాదు.. ఆధునిక వైఫై సపోర్ట్‌తో వీడియోలను వేగంగా స్ట్రీమింగ్ చేయొచ్చు. డబుల్ బాస్‌తో ఆడియో నాణ్యత అదుర్స్!

ధర: రూ.42,000

**ఐక్యూ పెంచుకుని కొత్తగా..!!**

మొబైల్ తయారీ రంగంలో తనదైన ముద్ర వేసింది వివో. ఇప్పుడు మరో ఉప బ్రాండ్ 'ఐక్యూఓఓ' పేరుతో మార్కెట్‌లో సందడి చేస్తున్నది. ఈ నేపథ్యంలోనే కొత్త స్మార్ట్‌ఫోన్ 13ని భారతదేశంలో విడుదల చేయడానికి సిద్ధమైంది. ఈ ఫోన్ ప్రాసెసర్‌తో పని చేస్తుంది. 13 తెర పరిమాణం 6.82-అంగుళాలు. డిస్‌ప్లే. 50% ట్రిపుల్ కెమెరా సిస్టమ్ ఉంది. ఫోన్ వెనక భాగంలో 50% 921 ప్రాథమిక సెన్సర్, 50% అల్ట్రా వైడ్ లెన్స్.. అలాగే, 50% టెలీఫొటో లెన్స్ ఉన్నాయి. దీంట్లో మరో ప్రత్యేకత ఏంటంటే.. ఫోన్ ప్రైమరీ కెమెరాల చుట్టూ 'లైట్ ఫ్లాష్' ని ఏర్పాటు చేశారు. కాల్స్, మెసేజ్‌లు వస్తే.. ఈ లైట్ ఆటోమాటిక్‌గా ఫ్లాష్ అవుతుంది. చార్జింగ్ స్టేటస్‌ని కూడా ఫ్లాష్ లైట్‌లో చూడొచ్చు. బ్యాటరీ సామర్థ్యం 6,000%. 120% ఫాస్ట్ చార్జింగ్‌తో చార్జ్ చేయొచ్చు. 69 రేటింగ్ నీళ్లు, దుమ్ముధూళి నుంచి రక్షణ కల్పిస్తుంది. %ఊుూ% 13 ఆండ్రాయిడ్ 15 ఆధారిత 15పై పనిచేస్తుంది.

ధర : రూ. 55,000

**విలువైన వాటి కోసం..**

ఇంట్లో విలువైన వస్తువులకు తగిన రక్షణ గురించి ఆలోచిస్తుంటాం. ప్రత్యేక లాకర్లను తయారు చేయించుకుంటాం. వాటికి మరింత అదనపు రక్షణ వలయాన్ని పెట్టుకోవాలనుకుంటే.. యేల్ సంస్థ తయారు చేసిన ని అమర్చుకుంటే సరి. మీ వార్డ్‌రోబ్ లేదా కేబినెట్‌లకు ఈ లాక్‌ని సులభంగా అమర్చవచ్చు. దీన్ని ఒక్కసారి ఇన్‌స్టాల్ చేసుకున్నాక.. మీ ఫింగర్ ప్రింట్ లేనిదే.. ఈ సరుగుని తెరవలేరు. ఇది మూడు రంగుల్లో అందుబాటులో ఉంది. ఇంట్లో ఇతర కుటుంబ సభ్యుల ఫింగర్ ప్రింట్స్‌ను కూడా జత చేయొచ్చు. మొత్తం 10 మంది యూజర్ల ప్రింట్స్‌ని తీసుకుంటుందిది. ఏదైనా అత్యవసర సందర్భాల్లో యూఎస్‌బీ పోర్ట్‌తోనూ అన్‌లాక్ చేయొచ్చు.

ధర: రూ.2,199

**మినీ ధరతో.. మ్యాగ్జిమమ్!**

టెక్నాలజీ ప్రియుల్లో బ్రాండ్‌బాబులు చాలామందే ఉంటారు. వారిలో ఎక్కువశాతం మంది 'యాపిల్' చేతబుచ్చుకుని తిరిగేవారే. డెస్క్‌టాప్ యూజర్లదీ అదే రూటు. మినీ మ్యాక్‌లను జేబులో పెట్టుకుని వెళ్లిపోతుంటారు. మరైతే, మీరు కూడా ఇదే బ్రాండ్‌బాబుల జాబితాలో చేరొచ్చు. 'అబ్బే.. మాదంత బడ్జెట్ కాదబ్బా..!!' అని అనుకోనక్కర్లేదు. ఎందుకంటే యాపిల్ మ్యాక్ మినీ ధర కాస్త తగ్గింది. ఓ హైఎండ్ ల్యాపీ ధరలోనే మధ్య తరగతి యూజర్లకూ దగ్గరవుతున్నది. తక్కువ పరిమాణంతో డెస్క్‌టాప్ అవసరాల్ని తీర్చేలా రూపొందించారు. ఇది 5ఐ5 అంగుళాల పరిమాణంలో ఉండటం వల్ల ఇంట్లో ఎక్కడైనా సులభంగా ఉంచుకోవచ్చు. చిప్‌లు ఉన్నాయి. ఇవి ఇంటెల్, ఏఎండీ చిప్‌ల కంటే వేగంగా పని చేస్తాయి. రోజువారీ పనులు నిర్వహించడంలోనే కాకుండా, కోడ్ కంపైలింగ్, వీడియో ఎడిటింగ్ వంటి కష్టమైన పనులను కూడా సులభంగా చేసుకోవచ్చు. వంటి అనేక అప్లికేషన్లు బాక్స్‌లోనే అందుబాటులో ఉంటాయి. ప్రాథమిక మోడల్ ధర రూ. 59,900గా ఉంది. కానీ విద్యార్థులు దీనిని రూ. 49,900కే కొనుగోలు చేయవచ్చు.

# రిక్రూట్‌మెంట్ నిలిపేసిన టెక్ కంపెనీ ఇక ఏఐపైనే ఆధారం



బై నౌ పే లేటర్ సేవలకు ప్రసిద్ధి చెందిన ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ క్లార్నా నూతన రిక్రూట్‌మెంట్‌లను నిలిపేసిందని. ఇటీవలే ఆ కంపెనీ సీఈఓ సెబాస్టియన్ సిమియాట్‌కోవ్స్కి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇప్పుడు సాంప్రదాయకంగా మానవ ఉద్యోగులు నిర్వహించే దాదాపు అన్ని పనులను చేస్తుందని పేర్కొన్నారు. ఇటీవల ఓ చానల్ నిర్వహించిన ఇంటర్వ్యూలో, సిమియాట్‌కోవ్స్కి ఏఐ కంపెనీలో అనేక పాత్రలను నిర్వహించగలిగే స్థాయికి ఎదిగిందని సూచించారు. ఒక సంవత్సరం క్రితం నుంచే క్లార్నా కొత్త సిబ్బందిని నియమించుకోవడం ఆపివేసిందని దాని వల్ల శ్రామికశక్తి క్రమంగా తగ్గిందని సిమియాట్‌కోవ్స్కి వెల్లడించారు. గతంలో 4,500 మంది ఉద్యోగులు ఉన్న కంపెనీ ఇప్పుడు 3,500 మందిని కలిగి ఉంది. సాంకేతిక సంస్థల్లో సాధారణంగా వార్షిక అట్రిషన్ రేటు కారణంగా 20 శాతం రీప్లేస్‌మెంట్‌లు ఉంటాయి. అయితే ఆ స్థానాలను భర్తీ చేసుకోకుండా క్లార్నా వర్క్‌ఫోర్స్‌ను కుదించడాన్ని ఎంచుకుంది. ముఖ్యంగా ఆటోమేషన్ కోసం ఏఐను వినియోగిస్తున్నారు. ఈ మార్పు ఉన్నప్పటికీ ప్రస్తుత ఉద్యోగుల జీతాలు ప్రతికూలంగా ప్రభావితం కాకూడదని సిమియాట్కోవ్స్కి సూచించారు. వాస్తవానికి తక్కువ మంది సిబ్బంది కారణంగా క్లార్నాకు సంబంధించిన మొత్తం జీతం ఖర్చులు తగ్గుతున్నందున మిగిలి ఉన్న వారికి భారీగా జీతం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలపై ఏఐ ప్రభావం గురించి ప్రపంచవ్యాప్త చర్చలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఇంటర్వ్యూ వైరల్ అయ్యింది. మెకిన్సే కంపెనీ 2023 నివేదిక ప్రకారం ఏఐ అభివృద్ధి చెందుతూనే ఉందని, ముఖ్యంగా 2030 నాటికి మిలియన్ల మంది కార్మికులు కొత్త ఉద్యోగాలు చూసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. కొత్త సిబ్బందిని చురుగ్గా నియమించకూడదని క్లార్నా తీసుకున్న నిర్ణయం ఏఐ ఇప్పటికే ఎలా రూపాంతరం చెందుతోందనేదానికి ఒక నిర్దిష్ట ఉదాహరణగా పరిగణించాలని నిపుణులు చెబుతున్నారు. క్లార్నా వెబ్‌సైట్‌లో కొన్ని ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు పేర్కొంటున్నప్పటికీ ఇంజనీరింగ్‌లో ముఖ్యమైన పాత్రలకు మాత్రమే నియామకాలు చేస్తున్నారని వివరిస్తున్నారు. కాలక్రమేణా ఏఐ వారి కార్యకలాపాల్లో విలీనం అవుతున్నందున టెక్ కంపెనీలు తమ వర్క్‌ఫోర్స్ వ్యూహాలను క్రమంగా సర్దుబాటు చేస్తున్నాయని పేర్కొంటున్నారు.